క్లుప్తంగా

సమయస్ఫూర్తితో మాట్లాడాలి

ఇచ్ఛాపురం రూరల్: మనం ఎదుటి వారితో గానీ, వేదికల ముందు ప్రసంగాల సమయంలో సమయస్ఫూర్తితో మాట్లాడాలని కమ్యూనికేషన్ స్కిల్ ట్రైనర్ శ్రీనివాస్ సోనూ అన్నారు. ఇచ్ఛాపురం జేసీఐ ఆధ్వర్యంలో మంగళవారం బి.తోటూరు ఆదిత్య డిగ్రీ కళాశాలలో 'ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీక్' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జేసీఐ అధ్యక్షుడు కాల్ల జయదేవ్, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, జోన్ ఆఫీసర్ తంగుడు షణ్ముఖ్, డాక్టర్ సంతోష్ సాహూ, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు

నాయకుల పరామర్శ

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గ దివంగత మాజీ ఎమ్మెల్యే దక్కత అచ్యుతరామయ్యరెడ్డి సతీమణి లక్ష్మమ్మ స్వగ్రామం బి.తోటూరులో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులు మంగళవారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. పరామర్శలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం పట్టణ కన్వీనర్ బి.ప్రకాశ్ పట్నాయక్, చాట్ల లోహిదాస్‌రెడ్డి, సాలిన ఢిల్లీ, పిలక సంతు, హంగీర్ హరా ఉన్నారు.

యలమంచిలిలో విషాదం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం యలమంచిలి గ్రామంలో విషాదం నెలకుంది. గ్రామానికి చెందిన కవిటి ఆనందరావు మే 20వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. దీంతో తండ్రి ఆకస్మిక మృతిని తట్టుకోలేక కొడుకు భాస్కరరావు (32) అప్పటి నుంచి మంచం పట్టడంతో పాటు రోజూ రోదిస్తుండేవాడు. దీంతో అనారోగ్యం బారినపడిన ఆయన కూడా మంగళవారం మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

రైతు నిరసన

టెక్కలి: తనకు చెందిన భూమిని రిటైర్డ్ వీఆర్వో కాజేయాలని ప్రయత్నిస్తున్నారంటూ గూడెం గ్రామానికి చెందిన రైతు పువ్వల డిల్లేశ్వరరావు మంగళవారం టెక్కలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ సత్యంకు వినతిపత్రం అందజేశారు.

కళాశాల సందర్శన

పలాస: విద్యార్థులకు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేయాలని ఇంటర్ విద్య డీవీఈవో ఆర్.సురేష్‌కుమార్ అన్నారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. ప్రణాళిక బద్ధంగా శ్రమిస్తూ వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన కోసం కోసం ఇప్పటి నుంచే విద్యార్థులను సన్నద్ధం చేయాలని చెప్పారు. కళాశాల రికార్డులను పరిశీలించారు.

కూటమి పాలనలో..
పంచాయతీలు నిర్వీర్యం!

- నిధులలేమితో అల్లాడుతున్న పంచాయతీలు
- 15వ ఆర్థిక సంఘ నిధుల కోసం ఎదురుచూపులు
- బ్లీచింగ్ ఫౌడర్ చల్లేందుకు కూడా నిధుల్లేవ్..



సోంపేట మండల పరిషత్ కార్యాలయం

సోంపేట: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యమవుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికే ప్రజలకు విశేష సేవలందిస్తున్న సచివాలయ వ్యవస్థను నీరుగార్చిన సర్కార్ ఇప్పుడు పంచాయతీ వ్యవస్థను కూడా ఉనికి లేకుండా చేస్తున్నారని సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు. నిధుల లేమితో పంచాయతీలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదంటున్నారు. కూటమి పాలనలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని అందజేస్తున్నామని గొప్పలు చెబుతున్న పాలకులు పంచాయతీ బకాయిలు చెల్లించేందుకు మాత్రం శ్రద్ధం చూపడం లేదు. అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని సర్పంచ్‌లు వాపోతున్నారు.

కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినా..

పంచాయతీలకు గత ఏడాది ఆగస్టు నెలలో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. అయితే మండలంలోని 23 పంచాయతీలకు నేటి వరకు ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు చెల్లించలేదు. సర్పంచ్‌లు ఆందోళన చేస్తున్నప్పటికీ స్పందనలేదు. ఇంత జరుగుతున్నప్పటికీ పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎందుకు పట్టించుకోవడం లేదని సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు చెల్లించి సంవత్సరం అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను వాడుకుని పంచాయతీల ఖాతాల్లో నిధులు జమచేయక పోవడం దారుణమని వాపోతున్నారు.

పంచాయతీలకు రూ. 5 కోట్లు బకాయి

సోంపేట మండలంలోని 23 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు ఐదు కోట్ల రూపాయల బకాయి ఉన్నట్లు సర్పంచ్‌లు చెబుతున్నారు. ఆర్థిక సంఘం నిధులు విడుదల కావక పోవడంతో పంచాయతీల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, మంచి నీటి మోటార్ల మరమ్మతులు, బ్లీచింగ్ పౌడర్ వేయడం, క్లాప్ మిత్ర జీతాలకు కూడా ఇబ్బందులు తప్పడం లేదని సర్పంచ్‌లు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

అప్పులు చేసి పనులు చేపడుతున్నాం



పంచాయతీల్లో అప్పులు చేసి పనులు చేపడుతున్నాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రం విడుదల చేసిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం వాడుకున్నా పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కలిపి వెంటనే విడుదల చేయాలి.

– తడక జోగారావు, పలాసపురం సర్పంచ్

చేతలకు మాటలకు పొంతనలేదు..



కూటమి ప్రభుత్వం మాటలకు, చేతలకు పొంతనలేదు. దేశాభివృద్ధికి పంచాయతీలే పట్టుకొమ్మలని, వాటికి అధిక ప్రాధన్యం ఇస్తామని చెప్పిన కూటమి నేతలు నేడు పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారు. కూటమి పాలనలో పంచాయతీలకు నిధులు లేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్నారు. 2026 మార్చిలోగా 15వ ఆర్థిక సంఘ నిధులు వినియోగించుకుని పనులు పూర్తి చేయకపోతే నిధులు వెనక్కి పోయే అవకాశం ఉంది. వెంటనే నిధులు మంజూరు చేయాలి.

– శిలగాన భాస్కరరావు, సుంకిడి పంచాయతీ సర్పంచ్

నిధులు మంజూరు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘ నిధులు వెంటనే విడుదల చేయాలి. పల్లెలు అభివృద్ధి చెందాలంటే నిధులు అవసరం. సంవత్సర కాలంగా పంచాయతీల్లో నిధులు జమ చేయక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– సంది సోనియా, రుషికుద్ద సర్పంచ్

త్వరలో నిధుల విడుదల



ప్రభుత్వం త్వరలో నిధులు విడుదల చేసే అవకాశం ఉంది. పంచాయతీ నిధులు పెండింగ్‌లో ఉండడంతో సర్పంచ్‌లు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. నిధులు విడుదల చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. నిధులు విడుదలైతే పంచాయతీలకు మేలు చేకూరుతుంది.

– సీహెచ్ ఈశ్వరమ్మ, ఎంపీడీవో

జాబ్ మేళాలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

పలాస: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారని పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి మంగళవారం తెలిపారు. మొత్తం 40 మంది పాల్గొని వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. 23 మంది జూనియర్ టెక్నీషియన్, 11 మంది మిషన్ ఆపరేటర్, ఆరుగురు అసెంబుల్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందిచారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంటు సెల్ ఆఫీసర్ పి.వెంకటరమణ, అధ్యాపకులు శ్రీనివాస్ పట్నాయక్, హేమాచలం, హేమరాజు, గిరిజ ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

ఇచ్ఛాపురం రూరల్: హెచ్ఐవీ, ఎయిడ్స్‌పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ రవికుమార్ అన్నారు. బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం యూపీహెచ్‌సీ ఆవరణంలో ఆశా కార్యకర్తలకు, వైద్య సిబ్బందితో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎయిడ్స్‌పై ఉన్న అపోహలను వివరించారు.

మహానేత.. మనసాస్మరామి

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేద ప్రజల గుండెచప్పుడుగా నిలిచారని నాయకులు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాభివృద్ధిలో కీలక భూమిక పోషించారని కొనియాడారు. మహానేత అమలు చేసిన సంక్షేమ పథకాలు లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపాయని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ పథకం, 108 వాహనాలను ప్రవేశపెట్టి వేలాదిమందికి ప్రాణభిక్ష పెట్టారన్నారు. మంగళవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



కవిటి: కవిటిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కడియాల ప్రకాష్ తదితరులు



కవిటి: కొత్తపుట్టుగలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు



టెక్కలిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నాయకులు



టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి గోడ గడియారాలు అందజేస్తున్న మేధావుల ఫోరం అధ్యక్షుడు జి.వి.రెడ్డి మాస్టారు



కోటబొమ్మాళిలో రాజన్న విగ్రహానికి నాయకుల నివాళులు



నందిగాంలో ఇన్‌చార్జి తిలక్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ శ్రీరామ్మూర్తి, పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర నాయకులు యర్ర చక్రవర్తి, కె.బాలకృష్ణ తదితరులు



టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం నౌపడలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రైతు సంఘం అధ్యక్షులు సుగ్గు రామిరెడ్డి తదితరులు



కంచిలిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎంపీపీ దేవదాస్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లోలాక్షి



కంచిలి: కేసరపడలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మండల పార్టీ నేత ఇప్పిలి క్రిష్ణారావు తదితరులు



ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి



ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం బస్టాండ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు



ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురంలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, నాయకులు



సోంపేట: రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, మండల పార్టీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు తదితరులు



సోంపేట సామాజిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న సోంపేట పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు



వజ్రపుకొత్తూరు రూరల్: పలాసలోని కిడ్నీ రిసెర్చ్ సెంటర్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, పార్టీ శ్రేణులు



వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, పార్టీ నాయకుడు ఉదయ్‌కుమార్ తదితరులు



పలాస: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్

డ్యాన్స్ పోటీలు..



ఇచ్ఛాపురం మండలం సన్యాసిపుట్టుగలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి డాన్స్ పోటీల్లో పాతిక జట్లు తలపడ్డాయి. సోలో విభాగంలో ప్రథమస్థానంలో శిబూ (బరంపురం), రెండవ బహుమతి వేణు రాయల్స్ (ఈదుపురం) గెలుచుకోగా, గ్రూప్ విభాగంలో ప్రథమ బహుమతి లిటిల్ స్టార్ గ్రూప్ (ఇచ్ఛాపురం), ద్వితీయ బహుమతి నీలాపు ప్రీతి–ఇసురు సౌభాగ్యవతి గ్రూప్(పేటూరు), తృతీయ బహుమతి కొత్తమ్మతల్లి గ్రూప్ (కోట బొమ్మాళి), ప్రోత్సాహక బహుమతులు ఢిల్లీ కళ్యాణ్ గ్రూప్ (టెక్కలి)లు కైవసం చేసుకున్నారు. విజేతలకు గ్రామ పెద్దలు, నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

–ఇచ్ఛాపురం రూరల్

ప్రమాదాల నివారణకు చర్యలు..



టెక్కలి మండలంలోని పలుచోట్ల ఉన్న మలుపులు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రమాదాల నివారణపై నేషనల్ హైవే సిబ్బంది దృష్టిసారించారు. మలుపులు వద్ద ప్రమాదాలను అరికట్టేందుకు రోడ్డు మధ్యలో పసుపురంగు లైన్లను ఏర్పాటు చేసే పనులను మంగళవారం నుంచి చేపడుతున్నారు. లచ్చన్నపేట వద్ద పనులను పూర్తి చేశారు. ఈ లైన్లను గమనించడం ద్వారా కొంత వరకు ప్రమాదాలను నివారించవచ్చునని సిబ్బంది తెలిపారు.

–టెక్కలి రూరల్

బహుమతి ప్రదానం..



కవిటి మండలం బొరివంకలో ఉద్దానం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి షార్ట్‌ఫిల్మ్ కాంపిటేషన్‌లో విజేతలకు మంగళవారం బహుమతులు అందించారు. ఆగస్టు 29వ తేదీన నిర్వహించిన పోటీల్లో 12 షార్ట్‌ఫిల్మ్‌లు పాల్గొన్నాయి. వీటిలో ప్రథమ స్థానాన్ని చిన్నక త్రివానిపాలెంకు చెందిన బివేర్ లఘుచిత్రం, ద్వితీయ, తృతీయస్థానాలు ఎంఎస్‌పల్లికి చెందిన తప్పెవరిది చిత్రానికి, బొరివంకకు చెందిన నాన్నమాట చిత్రానికి దక్కాయి. న్యాయనిర్ణేతలుగా లక్ష్మణమూర్తి, కేశవరావు వ్యవహరించారు. విజేతలకు సర్పంచ్ శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు సతీష్ ధనంజయ మజ్జి, రామకృష్ణ,శంకరరావు బహుమతులు అందజేశారు.

–కవిటి

కొబ్బరి సాగుపై అవగాహన



కొబ్బరి మొక్కను నాటుతున్న ప్రిన్సిపాల్ సింహాచలంనాయుడు

కవిటి: కొబ్బరిపంట ఉద్దానం ప్రాంత కుటుంబాలకు జీవనాడి కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు అన్నారు. మంగళవారం ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు కొబ్బరిపంట సాగుపై అధ్యాపక బృందం అవగాహన కల్పించారు. ఉద్దానంలో వేలాది కుటుంబాలకు జీవనాధారమైన కొబ్బరిపంట భావి తరాలకు బదలాయించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో కొబ్బరి మొక్కలను నాటారు.

మురుగు సమస్యను పరిష్కరించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: చినవంక పంచాయతీ పరిధి గుల్లలపాడు బీసీ కాలనీలో ప్రజలను వెంటాడుతున్న మురుగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు బమ్మిడి ఆనందరావు, సీఐటీయూ నాయకులు నెయ్యిల మోహన్‌రావు కోరారు. గ్రామంలో మంగళవారం పర్యటించిన అనంతరం మాట్లాడారు. ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు, మురుగు వచ్చి లోతట్టుగా ఉన్న కాలనీలోని ఇళ్లల్లోకి చేరుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరించిన సర్కార్

- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

పలాస:

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించిందని మాజీమంత్రి, వైఎస్సార్ సీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు విమర్శించారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చేస్తుంటే కనీసం పట్టించుకోవడం లేదన్నారు. కాశీబుగ్గలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. రాజశేఖరరెడ్డి మొదటిసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత జలయజ్ఞం పేరిట రైతాంగానికి సాగునీరు అందించారని చెప్పారు. అందులో భాగంగానే పలాస నియోజకవర్గానికి ఆఫ్‌షోర్ రిజర్వాయర్ మంజూరు చేసి ఆ పనులను కూడా ఆయనే ప్రారంభించారన్నారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో పనుల్లో జాప్యం కలిగిందని, అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పనులు మళ్లీ ప్రారంభమయ్యాయన్నారు. కుడి, ఎడమ కాలువల పనులతో పాటు మొత్తం 60 శాతం పనులు పూర్తయ్యాయని, భూ సేకరణ పనులు కూడా పూర్తి చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. వైఎస్సార్ ఆశయాల కోసం పుట్టిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని చెప్పారు. వైఎస్సార్ నాడు చేపట్టిన అన్ని పథకాలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేయడంతో పాటు ప్రజాసంక్షేమంటే ఏమిటో ప్రజలకు తెలియజేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ద్రోహం చేశాడని.. కనీసం రైతులకు ఎరువులు కూడా ఇచ్చుకోలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. రైతులు రోడ్డు మీదకు వచ్చి ఆందోళన చేయాల్సిన పరిస్థితి దాపురించదని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి తన తండ్రి లాగా రైతుల సంక్షేమం కోసం ఆలోచించి రైతు భరోసా కేంద్రాలు పెట్టి విత్తనం నుంచి ఎరువు వరకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించారని చెప్పారు. పలాస నియోజకవర్గానికి మొత్తం 1500 మెట్రిక్ టన్నులు ఎరువుల అవసరం ఉండగా 414 మెట్రిక్ టన్నులు కేటాయించారని..అవి కూడా కేవలం టీడీపీ కార్యకర్తలకే ఇచ్చారని ఆరోపించారు. యూరియా కొరతతో రైతులు అల్లాడిపోతున్నారని అన్నారు. ఎరువుల కొరతకు రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని కారణంగా చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు రష్యాతోపాటు ఇతర దేశాల నుంచి క్రూడాయిల్ ఎలా వస్తుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పలాస–కాశీబుగ్గ పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు దొర, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పాలిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పైల వెంకటరావు, ఉంగ సాయిక్రిష్ణ, బోర క్రిష్ణారావు, మీసాల సురేష్‌బాబు, బోర చంద్రకళ, దువ్వాడ రవి, బమ్మిడి దుర్యోధన, సుజాత పండా, గుజ్జు జోగారావు, నర్తు వెంకటరమణ, పి.వి.సతీష్, తూముల శ్రీనివాసరావు, బత్తిన హేమేశ్వరరావు, మల్లా సురేష్‌కుమార్, బమ్మిడి సంతోష్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.